క్లుప్తంగా

మర్యాద పూర్వక కలయిక


వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌తో గోరుముచ్చు గోపాల్

కామవరపుకోట: తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని స్టేట్ కౌన్సిల్ సభ్యుడు గోరుముచ్చు గోపాల్ యాదవ్ బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. వారితో పాటు వైఎస్సార్ సీపీ నాయకులు అల్లూరి పెద్దిరాజు, మారంపూడి సత్యనారాయణ, గోరుముచ్చు శ్రీనివాసరావు, రవితేజ పాల్గొన్నారు.

పంచాయతీ విభాగ కార్యదర్శి


వైఎస్సార్ సీపీ అధినేతతో మల్నీడి బాబి

జంగారెడ్డిగూడెం: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగం కార్యదర్శి మల్నీడి బాబి బుధవారం మర్యాపూర్వకంగా కలిశారు.

అయ్యప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు


జంగారెడ్డిగూడెం: మండలంలోని గుర్వాయిగూడెం శ్రీహరిహరసుత అయ్యప్ప స్వామి ఆలయంలో బుధవారం సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. స్వామి వారికి పంచామృతాభిషకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ పర్యవేక్షించింది.

పాఠశాలకు వాటర్ డిస్పెన్సర్ వితరణ


పూర్వ విద్యార్థులు అందజేసిన డిస్పెన్సర్

లింగపాలెం: పూర్వ విద్యార్థులు పాఠశాలకు వాటర్ డిస్పెన్సర్‌ను అందజేశారు. ఏలూరు జిల్లా లింగపాలెం మండలం కలరాయనగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు 2024–25 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు అల్లాడి సింధు, దీపిక, ఇందు కలిసి 9,500 విలువ గల వాటర్ డిస్పెన్సర్‌ను అందజేశారు. డిస్పెన్సర్ అందజేసిన పూర్వ విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

సుస్థిర అభివృద్ధికి కృషి చేయాలి


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంపీడీవో

బుట్టాయగూడెం: గ్రామాల్లో సుస్థిర అభివృద్ధి సాధించే దిశగా పంచాయతీ కార్యదర్శులు, ప్రజా ప్రతినిధులు కృషి చేయాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం గ్రామ పంచాయతీ సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ, మండల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఓ బేబీ సరోజిని, ట్రైనర్ రాజారావు, తదితరులు పాల్గొన్నారు.

వాహన తనిఖీలు


వాహన తనిఖీలు చేస్తున్న ఆర్టీవో అధికారులు

జంగారెడ్డిగూడెం: నిబంధనలు పాటించి వాహనాలను నడపాలని పాఠశాలల యాజమాన్యాలకు ఆర్టీవో (ఎఫ్ఏసీ), ఎంవీఐ ఎస్ఎస్ రంగనాయకులు సూచించారు. జంగారెడ్డిగూడెంలో బుధవారం పాఠశాలల బస్సుల తనిఖీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎంవీఐ కేడీవీ రవిగోపాల్, సీహెచ్ సత్యనారాయణ మూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

విచ్చలవిడిగా కరిచేస్తున్నాయ్!

- జంగారెడ్డిగూడెం పట్టణంలో కుక్కల బెడద
- ప్రజలు, పశువులపై దాడి
- విచ్చలవిడిగా తిరుగుతున్న వీధి శునకాలు


జంగారెడ్డిగూడెంలో వీధుల్లో గుంపులుగా తిరుగుతున్న వీధి కుక్కలు

జంగారెడ్డిగూడెం: పట్టణంలో వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉంది. రోజు రోజుకూ దీని తీవ్రత పెరుగుతోంది. కుక్కలు దాడి చేయడంతో పలువురు గాయాల పాలవుతున్నారు. రహదారుల వెంట వెళ్లే ప్రజలు, మూగ జీవాలు, పశువులపైకి కుక్కలు దాడులు చేస్తున్నాయి. దిచక్ర వాహనాలపై వెళ్లే వారి వెంట కుక్కలు పడడంతో వారు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇక పట్టణంలో ఉదయాన్నే వాకింగ్‌కి వెళ్లేవారు కుక్కల గుంపుకు భయాందోళనలకు గురవుతున్నారు. కుక్కలు వీధుల్లో గుంపులు గుంపులుగా తిరుగుతున్నాయి. చిన్న పిల్లలు బయటకు రావాలంటే భయపడే పరిస్థితి నెలకొంది. దీనిపై అధికారులు చర్యలు చేపట్టిన దాఖలాలు లేవని ప్రజలు వాపోతున్నారు. ఏదైనా ప్రమాదం సంభవించిన తరువాత హడావిడి కంటే ముందుగానే వీధి కుక్కల సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

కౌన్సిల్ సమావేశంలో

ఇటీవల జరిగిన జంగారెడ్డిగూడెం మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో కౌన్సిలర్లు కుక్కల బెడద అంశాన్ని లేవనెత్తారు. పట్టణంలో కుక్కల సంఖ్య పెరిగిపోయిందని, వాటిని అరికట్టాల్సి ఉందన్నారు. అధిక సంఖ్యలో కుక్కలు తిరుగుతుండటంతో ప్రజలు, ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. కమిషనర్ వివరణ ఇస్తూ ఇటీవల కుక్కల సంఖ్య పెరగకుండా చర్యలు తీసుకుంటున్నామని, 416 కుక్కలకు బర్త్ కంట్రోల్ ఆపరేషన్లు చేయించినట్లు తెలిపారు.

పిల్లలు ఆడుకునేందుకు భయపడుతున్నారు

ఇటీవల దసరా సెలవులు నేపథ్యంలో చిన్నారులు వీధుల్లో, ఇంటి పరిసరాల్లో ఆడుకునేందుకు కూడా భయపడే పరిస్థితి ఏర్పడింది. రోడ్డుపై నడిచే వారిని, మోటార్‌సైకిల్స్ వెళ్లేవారిని వెంబడిస్తున్నాయి. దీంతో వారు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఏదైన ప్రమాదం సంభవించే లోపే తగు చర్యలు తీసుకుని కుక్కల బెడద తొలగించాలి

– వి.వినోద్, జంగారెడ్డిగూడెం

కుక్కలు పెరగకుండా చర్యలు తీసుకోవాలి

జంగారెడ్డిగూడెం పట్టణంలో కుక్కలు గుంపులుగా తిరుగుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఇటీవల జీలుగుమిల్లి మండల కేంద్రంలో వీధి కుక్కల దాడిలో సుమారు ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. అటువంటి పరిస్థితి జంగారెడ్డిగూడెం పట్టణంలో చోటు చేసుకోకుండా, కుక్కలు పెరగకుండా చర్యలు తీసుకోవాలి.

– ఎం.కిరణ్, జంగారెడ్డిగూడెం

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

చింతలపూడి: ఈ నెల 9వ తేదీన శంకు చక్రపురం సబ్ స్టేషన్ పరిధిలో గల తిమ్మిరెడ్డిపల్లి ఫీడర్‌కు ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సత్యసాయి ఫీడర్‌కు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శెట్టివారిగూడెం సబ్‌స్టేషన్ పరిధిలో నామవరం ఫీడర్‌కు ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆర్‌డీఎస్ఎస్ వర్క్స్ నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని విద్యుత్ ఈఈ పీర్ అహ్మద్‌ఖాన్ తెలిపారు.

భక్తులను డబ్బులు డిమాండ్ చేసిన మహిళ

ద్వారకాతిరుమల: మొక్కుబడి పేరుతో భక్తులను మోసగించి వారి నుంచి డబ్బులు వసూలు చేస్తున్న ఓ మహిళను శ్రీవారి దేవస్థానం సెక్యూరిటీ సిబ్బంది బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. వివరాల్లోకి వెళితే..శ్రీవారి ఆలయ పరిసరాల్లో ఏలూరుకు చెందిన ఓ మహిళ గత కొద్ది రోజులుగా బిక్షాటన చేస్తోంది. యాచించిన సొమ్ముతో స్వామి వారికి మొక్కుబడి చెల్లించాలన్న సెంటిమెంట్ పేరుతో, భక్తులను డిమాండ్ చేస్తూ ఒక్కొక్కరి వద్ద రూ.100 నుంచి రూ.500 వసూలు చేస్తోంది. ఈ మేరకు ఆమెను దేవస్థానం సెక్యూరిటీ సిబ్బంది పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు.

సూపర్ సేవింగ్ జీఎస్టీ శిబిరం

జంగారెడ్డిగూడెం: జీఎస్టీ 2.0 ద్వారా ప్రజలకు ఆర్థిక ప్రయోజనాలు చేకూరనున్నాయని సీఎస్‌టీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.ప్రసాద్‌బాబు అన్నారు. జంగారెడ్డిగూడెం ఛత్రపతి శివాజీ త్రిశతజయంతి ప్రభుత్వ డిగ్రీకళాశాలలో సూపర్ జీఎస్టీ 2.0 కార్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కె.సత్యనారాయణ, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బీవీఎస్ దేవి తదితరులు పాల్గొన్నారు.

వారోత్సవాల ముగింపు

జంగారెడ్డిగూడెం: వృద్ధులు సమాజానికి గ్రంథాలయాల వంటి వారని చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ అన్నారు. జంగారెడ్డిగూడెంలో అంతర్జాతీయ వృద్ధుల వారోత్సవాల ముగింపు సందర్భంగా బాపూజీ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. సీనియర్ సిటిజన్స్ సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని వాగ్దానం చేశారు. జంగారెడ్డిగూడెం మున్సిపల్ చైర్మన్ బత్తిన లక్ష్మీ మాట్లాడుతూ వృద్ధులను సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.రాధాకృష్ణమూర్తి, ఏపీ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జాతీయ ఉపాధ్యక్షుడు కుకునూరి రామచంద్రరావు, జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, ఆర్వీ ఎం.ముక్కంటి, కొండ్రెడ్డి కిషోర్, నంబూరి రామచంద్రరాజు, నంబూరి రామలింగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి


జంగారెడ్డిగూడెం: విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు


కామవరపుకోట: రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు


లింగపాలెం: ఆటల పోటీలు ప్రారంభిస్తున్న ఎంఈవో రామారావు


చింతలపూడి: తైక్వాండోలో ప్రతిభ చూపిన క్రీడాకారులు

జంగారెడ్డిగూడెం: విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని పలువురు వక్తలు అన్నారు. స్కూల్ గేమ్స్ అండ్ ఫెడరేషన్ తరఫున ఈ నెల 7వ తేదీన వీరవాసరంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఫెన్సింగ్ పోటీల్లో జంగారెడ్డిగూడెం బాయ్స్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ మేరకు బుధవారం పాఠశాలలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. హెచ్‌ఎం పి.సోమశేఖర్ మాట్లాడుతూ జిల్లా స్థాయి ఫెన్సింగ్ పోటీల్లో తొమ్మిదో తరగతి చెందిన కొప్పుల కీర్తన అండర్–17లో, 7వ తరగతి విద్యార్థి గణపవరపు సాయి ధాత్రి అండర్–14 కేటగిరీల్లో రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారని తెలిపారు. పీడీలు భూదేవి, కామేశ్వరీలను ఆయన అభినందించారు. పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ చిక్కాల సత్యనారాయణ, శివప్రసాద్, నబి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఆడమిల్లి విద్యార్థులు

కామవరపుకోట: రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఆడమిల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు గంటా రవిచంద్ర మోహన్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల ఆరో తేదీన ఏలూరు ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో అండర్–14, అండర్–17 విభాగాల్లో పాఠశాలకు చెందిన 13 మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయుడు మానకొండ సుబ్బారావు, విద్యార్థులను పాఠశాల సిబ్బంది, గ్రామస్తులు అభినందించారు.

తైక్వాండోలో స్వర్ణ పతకం

చింతలపూడి: ఏలూరు ఇండోర్ స్టేడియంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా బుధవారం నిర్వహించిన తైక్వాండో క్రీడలో చింతలపూడి స్పోర్ట్స్ కరాటే అకాడమీకి చెందిన బండి జస్వంత్ అండర్–17 విభాగంలో స్వర్ణ పతకం సాధించి, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికై నట్లు కోచ్ సుమన్‌రాజు తెలిపారు. ఏలూరు జిల్లా స్పోర్ట్స్ సెక్రటరీ అలివేలు మంగ క్రీడాకారులను అభినందించారు.

ఆటల పోటీలు ప్రారంభం

లింగపాలెం: మండలంలోని శింగగూడెం జెడ్పీ హైస్కూల్‌లో బుధవారం ఎస్‌టీఎఫ్ మండల స్థాయి ఆటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఎంఈవో రామారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ఆటల పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. సుమారు 200 మంది విద్యార్థులు క్రీడల్లో పాల్గొన్నారు. ఈ పోటీల్లో పీడీలు, మండల కో–ఆర్డినేటర్ సీహెచ్ ప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు వినూత్నంగా ఆలోచించాలి

కామవరపుకోట: విద్యార్థులు వినూత్నంగా ఆలోచించాలని జిల్లా మానసిక కౌన్సిలర్ మానుకొండ సుధీర్ తెలిపారు. బుధవారం మండలంలో కళ్లచెరువు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయుడు కె.జయ సుభాకర్‌రావు ఆధ్వర్యంలో విద్యార్థులకు మానసిక ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుధీర్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు నాణ్యమైన ఆహారం తీసుకోవాలని, భావోద్వేగాలను అదుపులో ఉంచుకోవాలని విద్యార్థులకు సూచించారు.

జేపీకి ఘన నివాళి

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం జేపీ సెంటర్‌లో జయప్రకాష్ నారాయణ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం వర్ధంతి నిర్వహించారు. జయ ప్రకాష్ నారాయణ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం షటిల్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో జేపీ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

భారీ అన్నప్రసాద వితరణ

జంగారెడ్డిగూడెం: స్థానిక అశ్వారావుపేట రోడ్డులో ఉన్న శ్రీవరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో బుధవారం అన్నప్రసాద్ వితరణ నిర్వహించారు. తొలుత ఆలయంలో వినాయక స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మందోటి హరిబాబు దంపతులు, చిరంజీవి కేదారేశ్వరి, కాటన్ నాగమురళి దంపతులు అన్నప్రసాద వితరణకు వారి వంతుగా సహాయం అందించినట్లు ఆలయ అన్నప్రసాద వితరణ కమిటీ తెలిపింది.

పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి


మండలంలోని ఎన్ఆర్ పాలెంలో వంట షెడ్‌ను పరిశీలిస్తున్న పీఓ

బుట్టాయగూడెం: మండలంలోని పలు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలను ఐటీడీఏ పీఓ కె.రాములు నాయక్ బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నూతిరామన్నపాలెం, రాజానగరం, కేఆర్‌పురం జూనియర్ కాలేజీలను సందర్శించి బాత్‌రూమ్‌లు, వంటగది, వాటర్ ట్యాంక్‌లు, విద్యార్థుల స్నానాల గదులను పరిశీలించారు. అదే విధంగా మంచినీటి బోర్‌వెల్‌లో ఉన్న నీటిని పరీక్షలు నిర్వహించాలని ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ అధికారులను ఆదేశించారు. అనంతరం పీఓ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశాల మేరకు పాఠశాలలను ఆకస్మిక తనిఖీ చేశామని చెప్పారు. ఆశ్రమ పాఠశాలలో, వసతిగృహాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: మున్సిపాలిటీ దగ్గర నుంచి శ్రీనివాసపురం జంక్షన్ వరకు బీటీ రోడ్డు పనులకు మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మితో కలిసి చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ బుధవారం శంకు స్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జంగారెడ్డిగూడెం పట్టణంలోని లక్ష్మీనారాయణ థియేటర్ దగ్గర నుంచి ఏరియా ఆసుపత్రి మీదుగా శ్రీనివాసపురం జంక్షన్ వరకు మున్సిపాలిటీ సాధారణ నిధులు రూ.1.40 కోట్ల వ్యయంతో రోడ్డు పనులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, మున్సిపల్ కమిషనర్ కేవీ రమణ, బత్తిన చిన్న , కూటమి నాయకులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో నివేదికలు అందించాలి


సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకుంటున్న డీఐఓ

బుట్టాయగూడెం: ప్రస్తుతం ప్రభుత్వాసుపత్రిలో వైద్యులు సమ్మెలో ఉన్నప్పటికీ ఆసుపత్రి ద్వారా అందించే అన్ని రకాల సేవలు సక్రమంగా జరిగేలా చూడాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి శోభ అన్నారు. మండలంలోని నందాపురం పీహెచ్‌సీని డీఐఓ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో వ్యాక్సిన్ కేరియర్లను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వైద్యులు లేకపోయినప్పటికీ ఏ ఒక్క రిపోర్ట్ ఆగకూడదన్నారు. ఎప్పటికప్పుడు రిపోర్టులు తమకు పంపించాలన్నారు. అనంతరం నిమ్మలగూడెంలో గర్భిణులు, బాలింతలతో ఆరోగ్య సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీపీహెచ్ఎన్ఓ బి.జ్యోతి, ఎంపీహెచ్ఈఓ పి.పెద్దిరాజు, సూపర్‌వైజర్ పి.ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

జంగారెడ్డిగూడెం: మున్సిపల్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు రేలంగి నాగరాజు అన్నారు. జంగారెడ్డిగూడెం మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ మున్సిపల్ ఉద్యోగులకు 12వ పీఆర్‌సీ ప్రకటించాలని, వెంటనే ఐఆర్ ఇవ్వాలని, మున్సిపల్ ఆప్కాస్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, తదితర సమస్యలను పరిష్కరించాలని కోరారు. మున్సిపల్ కమిషనర్ కేవీ రమణకు వినతిపత్రం అందజేశారు.

ఐద్వా మహాసభలను జయప్రదం చేయండి

టి.నరసాపురం: ఈ నెల 13, 14, 15 తేదీల్లో అనంతపురంలో జరిగే ఐద్వా రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా కార్యదర్శి ఎ.శ్యామలరాణి పిలుపునిచ్చారు. కృష్ణాపురంలో మెట్ట ఏఎస్ఆర్ నగర్‌లో ఐద్వా సమావేశం నిర్వహించారు. శ్యామలారాణి మాట్లాడుతూ రాష్ట్ర మహాసభలు సందర్భంగా మండల కేంద్రంలో ప్రాథమిక కమిటీ జండా ఆవిష్కరించాలని పిలుపునిచ్చారు. సభలకు జాతీయ నాయకులు, 600 మంది ప్రతినిధులు హాజరవుతున్నారని తెలిపారు.

చట్టాలపై అవగాహన తప్పనిసరి



సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ క్రాంతికుమార్

చింతలపూడి: చట్టాలపై విద్యార్థినీ, విద్యార్థులకు అవగాహన తప్పనిసరని సీఐ క్రాంతి కుమార్ అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం సైబర్ నేరాలు, పోక్సో చట్టాలపై కళాశాల ఈగల్ క్లబ్, పోలీస్ శాఖల ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ టి.క్రాంతి కుమార్ మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు బానిసలై, సులభంగా డబ్బు సంపాదించడానికి తప్పుడు మార్గాలు అవలంబిస్తున్నారన్నారు. దీంతో సైబర్ నేరాలకు బలవుతున్నారని చెప్పారు. చదువుకోవలసిన వయసులో ప్రేమ పేరుతో పోక్సో చట్టం అతిక్రమించి యువత బలవుతున్నారని, వీటిపై అప్రమత్తంగా ఉండాలని ఎస్సై కె.సతీష్ కుమార్ హెచ్చరించారు. కార్యక్రమంలో కళాశాల ఈగల్ క్లబ్ సమన్వయకర్తలు ఎ.వెంకటేశ్వరరావు, లెఫ్టినెంట్ మౌనిక, ప్రిన్సిపాల్ పి.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ ఎన్‌జేకే నరేంద్రకుమార్, కానిస్టేబుల్ టి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పల్లె నిద్ర

లింగపాలెం: మండలంలోని మఠంగూడెం పంచాయతీ సుందరరావుపేట గ్రామంలో పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు. ధర్మాజీగూడెం ఎస్సై వెంకన్నబాబు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో సీఐ క్రాంతికుమార్ మాట్లాడుతూ చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ముఖ్యంగా యువత సైబర్ నేరాలు, డ్రగ్స్, ట్రాఫిక్ నిబంధనలు, బాల్య వివాహాలు, కోడి పందేలు, పేకాట, నాటుసారా తయారీ, బాణసంచా అక్రమ తయారీ, అసాంఘిక కార్యక్రమాల వలన కలిగే దుష్పరిణామాలు, చట్టపరంగా తీసుకునే చర్యలపై అవగాహన చేసుకోవాలన్నారు.

బాణసంచా దుకాణాలకు అనుమతి తప్పనిసరి

చింతలపూడి: దీపావళి బాణసంచా తయారీ కేంద్రాలు, షాపులకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని చింతలపూడి సీఐ క్రాంతికుమార్ అన్నారు. చింతలపూడిలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దీపావళి పండుగను ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలని, బాణసంచా తయారీదారులు, దుకాణదారులు జాగ్రత్తలు పాటించాలన్నారు. నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రహదారుల సమస్యలు పరిష్కరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎ.రవి

టి.నరసాపురం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రహదారుల నిర్మాణాన్ని గాలికొదిలేసిందని సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి అన్నారు. టి.నరసాపురంలో సీపీఎం మండల కమిటీ సమావేశం బొద్దుల గంగా భవానీ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో రవి మాట్లాడుతూ సరైన రహదారులు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. లక్ష్మీపురం నుంచి టి.నరసాపురం మండల కేంద్రానికి వెళ్లే రోడ్డు, చింతలపూడి కనెక్టింగ్ రోడ్డు, మక్కినవారిగూడెం రోడ్డు, తదితర రోడ్లు అధ్వానంగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి మడకం సుధారాణి, మడకం కుమారి, శిరీష, పూనెం సూర్యారావు, గూడెల్లి వెంకటరావు, అనుమోలు మురళి, సయం దుర్గమ్మ, బరగడ కుమారి తదితరులు పాల్గొన్నారు.

రహదారులు నిర్మించాలి

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం నుంచి ఏలూరు వెళ్లే ప్రధాన రహదారి నిర్మాణం చేపట్టాలని సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ కన్వీనర్ పి.సూర్యారావు, మండల కార్యదర్శి ఎం.జీవరత్నం తదితరులు పాల్గొన్నారు.

గవాయ్‌పై దాడి దారుణం


నిరసన సభలో పాల్గొన్న ఐఎఫ్‌టీయూ నేతలు

జంగారెడ్డిగూడెం: సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై దాడి దారుణమని, దాడి చేసిన వ్యక్తిని అరెస్టు చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి కేవీ రమణ డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడిని ఖండిస్తూ బోసు బొమ్మ సెంటర్‌లో నిరసన సభ నిర్వహించారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ డివిజన్ ప్రధాన కార్యదర్శి మంచిలి రాజు, పట్టణ కార్యదర్శి మల్లేటి శ్రీను, సూదిపాము జయరాజు, మార్లపూడి సుబ్బారావు, వసంతాటి సత్య, పత్తిపాటి వెంకన్న, పెనుమాక వెంకటేశ్వరరావు, మర్రి శ్రీను, కొత్తూరు అబ్బులు తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ తరగతులు

జంగారెడ్డిగూడెం: ఎల్ఎస్‌డీజీ థీమ్‌పై శిక్షణ తరగతులు బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించారు. ఎంపీడీవో కేఆర్ఎస్ కృష్ణప్రసాద్ అధ్యక్షతన శిక్షణా తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాతూ 2025–26 గ్రామపంచాయతీ సుస్థిర అభివృద్ధి లక్ష్యాల స్థానీకరణ ఎల్ఎస్‌డీజీ థీమ్‌పై 1 నుంచి 8 అంశాలపై రెండు రోజుల శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పో ల్నాటి బాబ్జి, జంగారెడ్డిగూడెం, కామవరపుకోట మండలాల ఎంపీపీలు, సర్పంచ్‌లు, పంచాయీ కార్యదర్శులు పాల్గొన్నారు.